క్లుప్తంగా

దేవదాయ శాఖ భూములు కాపాడండి

ములకలచెరువు: మండలంలోని గూడుపల్లె పంచాయతీలో ఉండే దేవదాయ శాఖ మాణ్యం భూములను కాపాడాలని సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఐ, బీఎస్పీ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... గూడుపల్లె లోని శ్రీ నందీశ్వరుడి ఆలయానికి చెందిన మాణ్యం భూముల్లో ఎస్సీ, ఎస్పీ, బీసీలకు చెందిన పలువురికి ఇండ్ల నిర్మాణాల కోసం కేటాయించారన్నారు. ఇప్పుడు ఆ భూముల్లో ఇండ్ల నిర్మాణాలకు కొందరు అడ్డువస్తున్నారని ఆరోపించారు. అనంతరం తహసీల్దార్ ప్రదీప్‌కి వినతి పత్రం అందజేశారు. నిరసన కార్యక్రమంలో మల్లికార్జున, అంజప్ప తదితరులు పాల్గొన్నారు.

భూ ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి

పీలేరు రూరల్ : మండలంలోని బోడుమల్లువారిపల్లె గ్రామ పంచాయతీలో ప్రభుత్వ భూముల ఆక్రమణ దారులపై చర్యలు తీసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్‌కు సోమవారం డీబీఎస్ఎఫ్ ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు బద్దె భానుప్రకాష్ ఫిర్యాదు చేశాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోడుమల్లువారిపల్లె పంచాయతీలో నిరుపేదలకు ఇచ్చిన ఇంటి స్థలాల తోపాటు ప్రభుత్వ భూమిని ఆక్రమించుకుని అమ్ముకున్నట్లు ఆరోపించారు. పలువురు పేదలు కనీసం ఇంటి స్థలం లేక ఇబ్బంది పడుతుంటే, ఆక్రమణదారులు దర్జాగా ప్రభుత్వ భూమిని సైతం ఆక్రమించుకుని విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారని తెలిపారు. సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు.

గర్భిణులు ఆరోగ్యంపై జాగ్రత్తలు వహించాలి



గర్భిణులకు వైద్య సలహాలు ఇస్తున్న మెడికల్ ఆఫీసర్ డాక్టర్ లీలా

రామసముద్రం : గర్భిణులు ఆరోగ్యంపై జాగ్రత్తలు వహించాలని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ లీలా తెలిపారు. సోమవారం స్థానిక పీహెచ్‌సీలో గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ. సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి నెలా 9, 10వ తేదీల్లో పీఎంఎస్ఎంఏ కార్యక్రమం కింద ఆసుపత్రిలో గర్భిణులకు వైద్య పరీక్షలు చేసి ఆరోగ్య సూత్రాలు తెలియజేయడం జరుగుతుందన్నారు. పౌష్టికాహారం గురించి వివరించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మౌలానాకు ఘన నివాళి



బి.కొత్తకోటలో అబుల్ కలాంకు నివాళులు

బి.కొత్తకోట: మైనార్టీ దినోత్సవం సందర్భంగా దేశ తొలి విద్యా మంత్రి, భారతరత్న మౌలానా అబుల్ కలాం అజాద్‌కు సోమవారం ఘన నివాళులు అర్పించారు. స్థానిక ఆదర్శ విద్యాలయంలో ఆయన చిత్రపటానికి ఉపాధ్యాయులు, విద్యార్థులు పూలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ విద్యా సంస్కరణల అమలు, సాంకేతిక విద్య, విశ్వవిద్యాలయాల ఏర్పాటుకు మౌలానా అద్యుడని అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శీనునాయక్, హనుమంతునాయక్, ఫయాజ్, మహేష్, పవన్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనం విజయవంతం చేయండి

పెద్దమండ్యం: మాదిగల ఆత్మీయ సమ్మేళనం విజవంతం చేయాలని ఎంఆర్‌పీఎస్ జిల్లా నాయకురాలు జయమ్మ కోరారు. మండలంలోని కోటకాడపల్లె హరిజనవాడ, కలిచెర్ల జరిజనవాడ, మండ్యం హరిజనవాడ, రెడ్డివారిపల్లె హరిజనవాడల్లో ఎంఆర్‌పీఎస్ కార్యకర్తలతో కలిసి సోమవారం ప్రచారం నిర్వహించారు. ఈ నెల 14న మదనపల్లె చౌడేశ్వరీ కళ్యాణ మండపంలో జరిగే మాదిగల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంఆర్‌పిఎస్ నేత మందక్రిష్ణమాదిగ వస్తున్నట్లు తెలిపారు. ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ హాజరై విజయవంతం చేయాలని ఆమె కోరారు. కార్యక్రమంలో ఎంఆర్‌పిస్ నాయకులు గోపి, రాములమ్మ, అంజి, హరినాద్, సునీల్, గంగయ్య పాల్గొన్నారు.

షూటింగ్‌బాల్ టోర్నీలో విద్యార్థుల ప్రతిభ

మదనపల్లె సిటీ: కర్నూలులో అవుట్‌డోర్ స్టేడియంలో ఈనెల 9, 10 తేదీల్లో నిర్వహించిన 7వ రాష్ట్ర షూటింగ్‌బాల్ పురుషుల చాంపియన్ షిప్ పోటీల్లో అన్నమయ్య జిల్లా మూడవ స్థానం కైవసం చేసుకున్నట్లు షూటింగ్ బాల్ జిల్లా కార్యదర్శి గౌతమి తెలిపారు. క్రీడాకారులకు ట్రోఫీ, మెడల్స్ అందుకున్నారు. క్రీడాకారులు, కెప్టెన్ శ్రీకుమార్, కోచ్ యూసఫ్ ,మురళిలను అసోసియేషన్ అధ్యక్షులు రమణారెడ్డి, ఉపాధ్యక్షులు రెడ్డిశ్రీనివాస్, సాగర్, సభ్యులు సురేష్, సాయిశేఖర్‌రెడ్డి సయ్యద్‌బాషా, నరేష్‌బాబులు అభినందించారు.

నిర్లక్ష్యపు నీడలో సంపద సృష్టి కేంద్రాలు

- చెత్త నిర్వహణ పడకేసింది
- పట్టించుకోని పంచాయతీ కార్యదర్శులు



బి.కొత్తకోట: కోటావూరు డంపింగ్ యార్డు దుస్థితి





కోటావూరు డంపింగ్ యార్డు తొట్టెలో ఖాళీ మద్యం సీసాలు, ఉపయోగం లేని గుమ్మసముద్రం డంపింగ్‌యార్డు

బి.కొత్తకోట: మండలంలోని సంపద సృష్టి కేంద్రాల (డంపింగ్ యార్డులు) నిర్వహణను పంచాయతీ కార్యదర్శులు గాలికి వదిలేశారు. మండలంలోని 11 పంచాయతీల్లోని చెత్తను సేకరించి వాటిని డంపింగ్ యార్డులకు తరలించి తడి, పొడి చెత్తను వేరు చేయాలి. వాటిలో వానపాములతో ఎరువులను తయారుచేయాలి. ఇందుకు అవసరమైన సామగ్రిని ప్రభుత్వం అందించడం, విద్యుత్, నీటి సౌకర్యాలను కల్పించింది. అయితే మండలంలో ఒక్క డంపింగ్ యార్డు కూడా నిర్వహణలో లేదు. అన్నింటిని వదిలేయడంతో పంచాయతీల్లో చెత్త సేకరణ అగిపోయింది. పారిశుద్ధ్యం పడకేసింది. గ్రామాల్లో ప్రజలకు పారిశుద్ధ్యం కరువైంది.

పట్టించుకునే నాథుడే లేరు:

పట్టించుకోవాల్సిన అధికారుల పర్యవేక్షణ లేదు. సమీక్ష లేదు, క్షేత్రస్థాయిలో పరిశీలన అసలే లేదు. దీనితో పంచాయతీ కార్యదర్శులు డంపింగ్ యార్డుల నిర్వహణను పూర్తిగా వదిలేశారు. అసలు తమకు సంబంధం లేనట్టుగా ఉండిపోయారు. దీని ఫలితంగా 11 డంపింగ్ యార్డుల్లోని తొట్టెలు, పరిసరాలు పిచ్చి మొక్కలతో నిండిపోయాయి. సాయంత్రం వేళల్లో మందుబాబులు ఇక్కడ విందులు చేసుకుంటున్నారు. పగిలిన మద్యం బాటిళ్లు, తాగిపడేసిన బాటిళ్లు, గ్లాసులతో నిండిపోయాయి. ఒక్క డంపింగ్ యార్డు కూడా నిర్వహణలో లేకపోవడం శోచనీయం. ప్రధానంగా పల్లెల్లో పారిశుద్ధ్యం పనులపై దృష్టి పెట్టాల్సిన పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులతో సమన్వయం చేసుకోలేకపోతున్నారు. నిధులు వెచ్చించేందుకు సర్పంచులు సిద్ధంగా ఉన్నా పంచాయతీ కార్యదర్శులు కొందరు టీడీపీ నాయకుల అవతారం ఎత్తారు. నిధులు ఖర్చు చేయాలంటే ఫలానా టీడీపీ నాయకుడిని కలిసి మాకు చెప్పిస్తే నిధుల ఖర్చుకు అనుమతి ఇస్తామంటూ మెలిక పెడుతున్నారు. దీనితో సర్పంచులు రాజకీయంగా ఇబ్బందులకు గురి చేస్తున్నారని గుర్తించి అధికారుల దృష్టికి కూడా తీసుకెళ్లారు. అయితే ఇప్పటిదాక పంచాయతీ కార్యదర్శుల్లో మార్పు లేదు. సమస్యలపైనా, పారిశుద్ధ్యం, డంపింగ్ యార్డుల నిర్వహణపై కనీసం పట్టించుకునే పరిస్థితుల్లో లేరు. దీనితో పంచాయతీల్లో సమస్యలు తిష్ట వేశాయి. డంపింగ్ యార్డుల నిర్వహణ మొదలైతే పంచాయతీల్లో పారిశుద్ధ్య పనులు మొదలవుతాయి. లేదంటే ఎక్కడి చెత్త అక్కడే..ఎక్కడి నిర్వహణ అక్కడే. ప్రజలకు మాత్రం ఇబ్బందులు తప్పవు.

కార్యకర్తలు అధైర్యపడొద్దు

వైఎస్సార్ సీపీ సమన్వయకర్త నిసార్‌అహ్మద్



సబ్ జైలు ఎదుట మీడియాతో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ సమన్వయకర్త నిసార్‌అహ్మద్

మదనపల్లె : వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలకు అండగా పార్టీ ఉంటుందని, ఎవరూ అధైర్యపడాల్సిన అవసరం లేదని మదనపల్లె వైఎస్సార్ సీపీ సమన్వయకర్త నిసార్‌అహ్మద్ అన్నారు. అక్రమ కేసులో అరెస్ట్ అయి రిమాండ్‌లో ఉన్న పుంగనూరు వైఎస్సార్ సీపీ నాయకులు, హజ్ కమిటీ మాజీ డైరెక్టర్ ఎస్.ఖాదర్‌బాషాను సోమవారం మదనపల్లె సబ్‌జైలులో నిసార్‌అహ్మద్ స్థానిక నాయకులతో కలిసి పరామర్శించారు. బాధితుల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సబ్‌జైలు ఎదుట నిసార్‌అహ్మద్ మాట్లాడుతూ...పుంగనూరులో ఎంపీ మిథున్‌రెడ్డి పర్యటన సందర్భంగా జరిగిన ఘటనలో ఉద్దేశపూర్వకంగా పోలీసులు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై తప్పుడుకేసులు పెట్టడం జరిగిందన్నారు. ఘటనతో సంబంధం లేనప్పటికీ, కేవలం రాజకీయకారణాలతో అమాయకులపై అక్రమ కేసులు బనాయించి అరెస్ట్ చేసి జైలుకు పంపారన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు అక్రమ కేసులు, అరెస్ట్‌లకు భయపడే ప్రసక్తి లేదన్నారు. ఎప్పటికైనా సత్యమే గెలుస్తుందని, కూటమిప్రభుత్వం అక్రమకేసులను వైఎస్సార్ సీపీ సమర్థవంతంగా ఎదుర్కొంటుందన్నారు. అధికారంలోకి వచ్చిన ఐదునెలలకే కూటమిప్రభుత్వం ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత మూటగట్టుకుందన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అందించిన సంక్షేమ ఫలాలను, సమర్థవంతమైన పాలనను గుర్తుచేసుకుని తప్పుచేశామని బాధపడుతున్నారన్నారు. టీడీపీ ప్రభుత్వంలో ఆశించిన అభివృద్ధి అందకపోగా, నాయకుల అవినీతి, అక్రమాలు అధికమయ్యాయన్నారు. కార్యక్రమంలో జిల్లా వక్ఫ్‌బోర్డ్ మాజీ చైర్మన్ ఎస్.ఏ.కరీముల్లా, కౌన్సిలర్ ఈశ్వర్‌నాయక్, వైఎస్సార్ సీపీ మైనారిటీ నాయకులు ఇస్మాయిల్, ఇర్ఫాన్, వైఎస్సార్ సీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మల్లయ్యకొండపై మారుమోగిన శివనామస్మరణ



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

తంబళ్లపల్లె: మండల కేంద్రానికి సమీపంలోని మల్లయ్యకొండపై వెలసిన శ్రీ భ్రమరాంబిక సమేత మల్లికార్జునస్వామి ఆలయం రెండో సోమవారం భక్తుల శివనామస్మరణతో మారుమోగ్రింది. కార్తిక మాసం రెండో సోమవారం కావడంతో సుదూర ప్రాంతాల నుంచి భక్తులు మల్లయ్యకొండకు వచ్చారు. పూజారులు ఈశ్వరప్ప, మల్లికార్జునలు స్వామికి ప్రత్యేక అలంకరణ చేశారు. పూజలు,అభిషేకాలతో భక్తులకు స్వామి దర్శనం కల్పించారు. నియమనిష్టలతో కేదారేశ్వరగౌరీవ్రతం నిర్వహించారు. నోములు నోచుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ఈఓ మునిరాజ, కొండ కిట్టల ఆధ్వర్యంలో భక్తులకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశారు. దేవస్థానం ఆధ్వర్యంలో అన్నసంతర్పణ నిర్వహించారు. మదనపల్లె వన్ డిపో మేనేజర్ వెంకటరమణారెడ్డి భక్తుల సౌకర్యార్థం మల్లయ్యకొండకు రెండు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారు.

సూపర్‌సిక్స్ ఊసెత్తని అసమర్థ ప్రభుత్వం

– మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చింతల

కలికిరి(వాల్మీకిపురం): సూపర్ సిక్స్ హామీలతో గద్దెనెక్కి, ఆ తర్వాత హామీల ఊసెత్తకుండా ప్రజలను మోసగిస్తోన్న అసమర్థ కూటమి ప్రభుత్వం అంటూ పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి మండిపడ్డారు. వాల్మీకిపురం మండలంలో విస్తృతంగా పర్యటించి పలు శుభకార్యక్రమాలకు హాజరై స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలను కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన కార్యకర్తలతో కలిసి మాట్లాడుతూ మహిళలకు ఉచిత ఆర్టీసీ ప్రయాణం, మహాశక్తి, నిరుద్యోగ భృతి వంటి ఏ ఒక్క హామీని కనీసం అమలు చేయడానికి కూడా ప్రణాళికలు రూపొందించకపోవడం దారుణమన్నారు. ఇవన్నీ ప్రజలు గమనిస్తున్నారన్నారు. ఏక్కడా ప్రభుత్వ దౌర్జన్యాలకు వెరవకూడదని, నియోజకవర్గాలలో పార్టీ అధిష్టానం లీగల్‌సెల్‌ను ఏర్పాటు చేసిందన్నారు. నాయకులు, కార్యకర్తలకు అండగా ఉండి కాపాడుకుంటామన్నారు. కార్యక్రమాలలో నాయకులు ఆనందరెడ్డి, కేశవరెడ్డి, నీళ్ల భాస్కర్, ఆనంద, శ్రీనివాసులురెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, కిశోర్‌కుమార్‌రెడ్డి తదితరులు ఎమ్మెల్యే వెంట పాల్గొన్నారు.

నేత్ర పర్వంగా హోమాలు, అభిషేకాలు



ప్రత్యేకాలంకరణలో స్వామివారు

పెద్దతిప్పసముద్రం: స్థానిక శివాలయం సేవకులు సనగరం పట్టాభి రామయ్య ఆధ్వర్యంలో ఈ నెల 2 నుంచి కార్తిక మాసోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం శివాలయంలో మహన్యాసపూర్వక ఏకదశ రుద్రాభిషేకం, రుద్ర హోమం, పూర్ణాహుతి, మహా మంగళహారతితో పాటు కార్తిక దీపోత్సవ కార్యక్రమాలను కనుల పండుగగా నిర్వహించారు. వేద పండితులు ప్రత్యేక పుష్పాలతో విగ్రహ ప్రతిమలను సుందరంగా అలంకరించి అధిక సంఖ్యలో విచ్చేసిన భక్తులకు స్వామి వారి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

యువజనోత్సవాల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

మదనపల్లె : శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ, తిరుపతి డైరెక్టరేట్ ఆఫ్ స్టూడెంట్ వెల్‌ఫేర్ అండ్ కల్చరల్ అఫైర్స్, ఇంటర్ కాలేజియేట్ యూత్‌ఫెస్ట్‌లో భాగంగా నిర్వహించిన యువతరంగ్–24 పోటీల్లో మదనపల్లెకు చెందిన శ్రీ శ్రీనివాస, జ్ఞానాంబిక డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ చూపి విజేతలుగా నిలిచినట్లు ఆయా కళాశాలల కరస్పాండెంట్లు ఎస్.శ్రీనివాసులురెడ్డి, డాక్టర్.రాటకొండ గురుప్రసాద్‌లు తెలిపారు. సోమవారం ఆయా కళాశాలల్లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశాల్లో విజేతలను అభినందించారు. కళాశాల నుంచి వివిధ విభాగాల్లో పాల్గొని బహుమతులు గెలుచుకున్నారన్నారు. విజేతలను కళాశాల చైర్మన్ ఎస్.కృష్ణారెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్.బి.వి.రమణాచారి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్.బి.కృష్ణారెడ్డి, జ్ఞానాంబిక ప్రిన్సిపాల్ సురభిరమాదేవి అభినందించారు.

కరీముల్లాఖాన్‌కు రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు

మదనపల్లె సిటీ: విజయవాడలో సోమవారం జరిగిన మైనార్టీ సంక్షేమ దినోత్సవం కార్యక్రమంలో మదనపల్లెకు చెందిన ఉపాధ్యాయుడు కె.సి.కరీముల్లాఖాన్ మైనార్టీ, న్యాయశాఖమంత్రి ఎన్ఎండి ఫారూఖ్ చేతుల మీదుగా రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉర్దూ ఉపాధ్యాయుడు అవార్డు అందుకున్నారు. అవార్డు గ్రహీతకు రూ.10వేలు నగదు, జ్ఞాపిక, దుశ్శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో వైద్య,ఆరోగ్యశాఖ మంత్రి సత్యప్రసాద్, ఎమ్మెల్యేలు షాజహాన్‌బాషా, నసీర్‌అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు



ఇన్‌చార్జ్ సబ్‌కలెక్టర్ రాఘువేంద్రకు ఆహ్వానపత్రిక అందజేస్తున్న గ్రంథాలయ అధికారి వసంతకుమారి

మదనపల్లె సిటీ: గ్రంథాలయ వారోత్సవాలను ఈనెల 14వతేదీ నుంచి నిర్వహించనున్నట్లు స్థానిక శాఖ గ్రంథాలయాధికారి వసంతకుమారి తెలిపారు. సోమవారం గ్రంథాలయ వారోత్సవాల ఆహ్వానపత్రికలను మదనపల్లె ఇన్‌చార్జ్ సబ్ కలెక్టర్ రాఘువేంద్ర, ఎంఈఓ ప్రభాకర్‌రెడ్డిలకు అందజేశారు. 14వతేదీ గ్రంథాలయ వారోత్సవాల ప్రారంభ వేడుకలు జరుగుతాయని ఇందులో భాగంగా బాలల దినోత్సవం నిర్వహిస్తామన్నారు. 15వ తేదీన పుస్తక ప్రదర్శన ఏర్పాటు, మాదక ద్రవ్యాలపై అవగాహన, పుస్తక పఠన ప్రాముఖ్యతపై సదస్సు నిర్వహిస్తామన్నారు. 16న గ్రంథాలయ ఉద్యమంలో పాల్గొన్న ప్రముఖుల గురించి స్మరించుట, 17న కవి సమ్మేళనాలు,సెమినార్లు, రచయితల సందేశాలు, 18న పాఠశాల విద్యార్థులకు చిత్రలేఖనం,వ్యాసరచన, వకృత్వ,క్విజ్, క్రీడల పోటీలు నిర్వహణ, 19వతేదీన మహిళలకు వివిధ కార్యక్రమాల్లో పోటీలు నిర్వహిస్తామన్నారు. 20వతేదీన డిజిటల్ గ్రంథాలయాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో ప్రముఖ నవలా రచయిత టీ.ఎస్.ఏ.క్రిష్ణమూర్తి, తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

సర్కిల్ కార్యాలయాన్ని తనిఖీ చేసిన డీఎస్పీ



మాట్లాడుతున్న డీఎస్పీ డి.కొండయ్యనాయుడు

ములకలచెరువు: మండల కేంద్రంలోని పోలీస్ సర్కిల్ కార్యాలయాన్ని మదనపల్లి డీఎస్పీ డి.కొండయ్య నాయుడు సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి సిబ్బందితో మాట్లాడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... ఇసుక అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు. పక్క రాష్ట్రాలకు తరలివెళ్లకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. మద్యం బెల్టుషాపులు నిర్వహిస్తే చర్యలు తీసుకోవాలని సిబ్బందికి ఆదేశించారు. సీఐ రాజారమేష్, ఎస్ఐ గాయత్రి ఉన్నారు.

మాదిగల ఆత్మీయ సదస్సు విజయవంతం చేయండి

నిమ్మనపల్లె : మదనపల్లి చౌడేశ్వరి కల్యాణ మండపంలో ఈ నెల 14న నిర్వహించనున్న మాదిగల ఆత్మీయ సదస్సు విజయవంతం చేయాలని ఎంఎస్‌పీ నాయకులు సొట్ట నరేంద్రబాబు పిలుపునిచ్చారు. సోమవారం ఎమ్మార్పీఎస్ మండల ఇంచార్జి రెడ్డి నారాయణ ఆధ్వర్యంలో జరిగిన ఎమ్మార్పీఎస్ మండల నాయకుల సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎస్.నరేంద్ర బాబు, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సూరిపాక వాసుదేవరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ అధినేత మందకృష్ణ మాదిగ నాయకత్వంలో ఎస్సీ వర్గీకరణ కోసం గత 30 ఏళ్లగా పోరాటం చేసి సుప్రీంకోర్టు ద్వారా సాధించామన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మందకృష్ణ మాదిగ పర్యటన విజయవంతం చేయడానికి,ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, శేషాద్రి రాజశేఖర్, గణేష్, కొమ్ము వెంకటేష్, వినోద్, బి.వెంకటేష్, రెడ్డప్ప పాల్గొన్నారు.

హెచ్‌ఐవీ నివారణపై అవగాహన

పీలేరు : హెచ్‌ఐవీపై నివారణపై అవగాహన అవసరమని కోర్ స్వచ్ఛంద సంస్థప్రతినిధి రాజమ్మ అన్నారు. సోమవారం మండలంలోని తలపుల జెడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఐవీ మీకు తెలుసా అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ఉపాధి హామీ ద్వారా గ్రామీణరోడ్ల అభివృద్ధి



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎంపీడీఓ శ్రీధర్‌రావు

పెద్దమండ్యం: ఉపాధి హామీ పథకం నిధులతో గ్రామీణరోడ్లను అభివృద్ధి చేస్తున్నట్లు ఎంపీడీఓ శ్రీధర్‌రావు తెలిపారు. మండలంలోని సీ గొల్లపల్లె పంచాయతీ రెక్కలకొండపల్లె హరిజనవాడ నుంచి పసలమంద వరకు రూ.12 లక్షల నిధులతో చేపట్టిన మట్టిరోడ్డు పనులను సోమవారం ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ నిధులతో గ్రామీణరోడ్లను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. పల్లెపండుగ-పంచాయతీ వారోత్సవాలలో భాగంగా దిగువపల్లె, పెద్దమండ్యం గ్రామాలలో రూ.16 లక్షలతో సిమెంటు రోడ్లు నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలోఎస్ఐ పి వి రమణ, ఏపీఓ మురళి, నాయకులు సుమన్, జయచంద్రారెడ్డి, గంగాధర, మహేష్‌లు పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టానికి తూట్లు

పెద్దతిప్పసముద్రం: సమాచార హక్కు చట్టాన్ని స్థానిక మండల పరిషత్ అధికారులు తూట్లు పొడుస్తున్నారు. గ్రామాల్లో జరిగిన అభివృద్ధి పనులు, నిధుల వివరాలపై ప్రజలు సమాచార హక్కు చట్టం ద్వారా ఈవోఆర్డీకి అధికారికంగా దరఖాస్తు చేసి రెండు నెలలు గడచిపోయినా పట్టించుకునే నాథులే కరువయ్యారని విమర్శలు వెల్లు వెత్తుతున్నాయి. పోతుపేట పంచాయతీకి మంజూరైన నిధులు, ఏపనికి ఎంత ఖర్చు చేశారు అనే వివరాలను గత నెల 9వ తేదీన సమాచార హక్కు చట్టం కింద ఇవ్వాలని మండలనికి చెందిన ఓ వ్యక్తి దరఖాస్తు చేసినా ఇంత వరకు సమాచారం ఇవ్వలేదు. సంబంధించి గ్రామ స్థాయి అధికారులకు మండల స్థాయి అధికారుల అండదండలు పుష్కలంగా ఉండటంతో సమాచారం ఇవ్వడంలో తీవ్ర అలసత్వం వహిస్తున్నట్లు తెలుస్తోంది. సమాచారం ఇస్తే అవినీతి బండారం బయట పడుతుందకున్నారో, అధికారుల నడుమ లోపాయికారి ఒప్పందాలు ఉన్నాయోమోనన్న అనుమానాలు ప్రజల్లో వ్యక్తమౌతున్నాయి. ఇప్పటికైనా అధికారులు సమాచార హక్కు చట్టాన్ని నిర్వీర్యం చేయకుండా ప్రజల హక్కులను కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

వాల్మీకి, బోయలను గిరిజనులుగా గుర్తించాలని వినతి

మదనపల్లె : వాల్మీకి, బోయలను గిరిజనులుగా గుర్తిస్తామని, మహర్షి వాల్మీకిజయంతిని సెలవుదినంగా ప్రకటిస్తామని ఎన్నికల సందర్భంగా కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని వాల్మీకి రిజర్వేషన్ సాధనసమితి రాష్ట్ర అధ్యక్షులు పొదలనరసింహులు డిమాండ్ చేశారు. సోమవారం సబ్ కలెక్టరేట్‌లో జరుగుతున్న ప్రజాసమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) కార్యక్రమంలో ఇన్‌చార్జ్ సబ్‌కలెక్టర్ రాఘువేంద్రకు వాల్మీకుల సమస్యలపై వినతి పత్రం సమర్పించారు. పొదలనరసింహులు మాట్లాడుతూ...వాల్మీకి,బోయలను గిరిజన జాబితాలో పునరుద్ధరణ చేసేందుకు 2017లో టీడీపీ ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి నివేదిక పంపిందన్నారు. ఇప్పటికైనా కూటమిప్రభుత్వం బీజేపీపై ఒత్తిడి తెచ్చి సమస్య పరిష్కారానికి చొరవ చూపాలని డిమాండ్ చేశారు.

ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం

పీలేరు రూరల్ : స్థానిక కన్యాకాపరమేశ్వరి ఆలయంలో సోమవారం పీలేరు ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం నిర్వహించారు. సోమవారం ఆర్యవైశ్య సంఘం కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బలసావే ణుగోపాల్, కార్యదర్శిగా రేవూరి సుధీర్, కోశాధికారిగా కేసర్ల బాలసుబ్రమణ్యం, జాయింట్ సెక్రటరీగా చింతలపల్లె రాజేష్, ఉపాధ్యక్షులుగా పామిడి మల్లికార్జున గుప్తా తోపాటు 15 మంది కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు.

భక్తిశ్రద్ధలతో కేదారనోముల వ్రతం



మదనపల్లె: వ్రతం ఆచరిస్తున్న భక్తులు



పీలేరు: నోములవ్రతంలో పాల్గొన్న భక్తులు

మదనపల్లె సిటీ: కార్తికమాసం పురస్కరించుకుని రెండో సోమవారం కేదార గౌరీనోముల వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక బెంగుళూరు రోడ్డులోని శ్రీ యోగభోగేశ్వరస్వామి ఆలయంలో స్వామికి ప్రత్యేక అలంకరణ చేసి పూజలు చేశారు. ఆలయంలోని మండపంలో కేదార నోముల వ్రతంను అర్చకులు విశ్వేశ్వరప్రసాద్ నిర్వహించారు. కేదారగౌరీ నోములవ్రత కథను భక్తులకు వినిపించారు. స్వామికి అత్తిరాసలు,వండ్లు సమర్పించారు. నోముదారాలు కట్టుకున్నారు. స్థానిక దేవళంవీధిలోని సోమేశ్వరస్వామి ఆలయంలో కేదార నోముల వ్రతాన్ని అర్చకులు ఫణికుమార్‌శర్మ నిర్వహించారు.

పీలేరు : స్థానిక శ్రీ కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో కార్తికమాసం రెండో సోమవారంను పురస్కరించుకుని మహిళలు కేదారేశ్వరస్వామి వ్రతం భక్తి శ్రద్దలతో చేపట్టారు. ఉదయం స్వామివారికి అభిషేకం, ప్రత్యేక అలంకరణ చేపట్టారు. అనంతరం పలువురు మహిళా భక్తులు ఆలయంలో కేదారేశ్వరస్వామి వ్రతం చేపట్టి నోములు నోచుకున్నారు. నోము దారాలు ధరించారు. ఆలయ ప్రధాన అర్చకులు కుమార్‌స్వామి నోముల వ్రతం గూర్చి కథను చదివి వినిపించారు.

గుర్రంకొండ: మండలంలోని పలు గ్రామాల్లో కేదారేశ్వర వ్రతాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. గుర్రంకొండలోని శ్రీమంజునాథస్వామి ఆలయం, తరిగొండలో శ్రీకాశీవిశ్వేశ్వర స్వామి ఆలయం, ఎగువబురుజుపల్లెలోని ఉమామహేశ్వరస్వామి ఆలయం, ప్యారంపల్లెలో శివాలయంలలో మహిళలు భక్తిశ్రద్ధలతో కేదారేశ్వర వ్రతాన్ని ఆచరించారు. అమ్మవారికి అత్తిరసాలను నైవేద్యంగా సమర్పించి నోముదారాలు, బంగారు నోములతో పండుగ నిర్వహించారు.

కలకడ : కేదారేశ్వర వ్రతాన్ని అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. మండలంలోని శ్రీకామాక్షిసమేత సిద్ధేశ్వరస్వామి ఆలయంలో, కోన ,నడిమిచెర్ల, ఎర్రకోటపల్లె పంచాయతీలలోని శివాలయాల వద్ద నోముదారాలు ధరించి ఉపవాసదీక్షతో పూజలు చేశారు.

यूनियन बैंक | Union Bank of India

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

మదనపల్లి బ్రాంచ్ (03701), సిటీఎం రోడ్డు, మదనపల్లి, కాంటాక్ట్ నెం.8928903701.

స్వాధీనత ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8(1) ప్రకారం నోటీసు (స్థిరాస్తుల కొరకు)

దిగువ సంతకందారుడు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, మదనపల్లి బ్రాంచ్ (03701), సిటీఎం రోడ్డు, మదనపల్లి, అన్నమయ్య జిల్లాకు ... 2002 ... [illegible] ... సెక్షన్ 13(12) ... 60 రోజులలోపు ... [illegible]

... సెక్షన్ 13(4) ... [illegible] ... యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ... సెక్షన్ 13(8) ... [illegible]

1) రుణగ్రహీతలు: ... [illegible] ... తండ్రి: సి.రాజశేఖర్ రెడ్డి
సహ-రుణగ్రహీత/హామీదారు : శ్రీ ... రాజశేఖర్ రెడ్డి, తండ్రి: సి.వెంకటరెడ్డి
బకాయి సొమ్ము: తేది.30.09.2024 నాటికి రూ.28,64,532.99 పై ... [illegible]
డిమాండ్ నోటీసు తేది: 30.08.2024 — స్వాధీనం తీసుకున్న తేది: 07.11.2024
స్థిరాస్తి వివరములు: అన్నమయ్య జిల్లా, మదనపల్లి ... [illegible] ... 185.80 ... [illegible]
హద్దులు : ... [illegible] ... డోర్ నెం.2-250-3-4-2 ... [illegible]

2) రుణగ్రహీతలు : 1) శ్రీ ... [illegible]
... [illegible]
బకాయి సొమ్ము: తేది.30.09.2024 నాటికి రూ.38,40,205.64 పై ... [illegible]
డిమాండ్ నోటీసు తేది: 30.08.2024 — స్వాధీనం తీసుకున్న తేది: 07.11.2024
స్థిరాస్తి వివరములు: అన్నమయ్య జిల్లా, మదనపల్లి టౌన్, ... వార్డు నెం.03, ... 43-2 మరియు 43-4లోని డి.నెం.10-146-23-6-6-3 లో ... 1876 ... 208.44 ... [illegible]

తేది: 07.11.2024, స్థలం: మదనపల్లి — సం/- అధీకృత అధికారి & చీఫ్ మేనేజర్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా